
విలేకరులు కావలెను
ఆంధ్ర తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మండల
రిపోర్టర్, కంట్రిబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్, కావలెను
తెలుగు భాషపై అవగాహన, వార్తలు రాయగల సత్తా
ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
JBN NEWS 24/7
MOBILE : 8886090199, 9885211993,

అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక



అనంతపురం శ్రీ సత్యసాయి 5
శుక్రవారం 17 అక్టోబర్ 2025

# నవంబర్ 16లోగా కమిటీలు పూర్తి చేయండి

- వైసీపీ నాయకులకు అనంత వెంకటరామిరెడ్డి సూచన
- డివిజన్ స్థాయిలో 'కోటి సంతకాల సేకరణ' పక్కాగా జరగాలి
- పార్టీకి చిత్తశుద్ధితో పనిచేసే వాళ్లనే కమిటీల్లో నియమించండి



అనంతపురం, అక్టోబర్ (అనంత ప్రభ)

వైఎస్ఆర్‌సీపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి డివిజన్ స్థాయిలో కమిటీల నియామకం చేపడుతున్నట్లు అనంతపురం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న క్యాంప్ కార్యాలయంలో కార్పొరేటర్లు, వైసీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీల నియామకం, ప్రైవేట్ మెడికల్ కళాశాలలకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణపై అనంత దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు పంచాయతీలు, 50 డివిజన్ల పరిధిలో కొత్తగా కమిటీలను నవంబర్ 16వ తేదీలోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి డివిజన్‌కు ఒక అధ్యక్షుడు, నలుగురు ప్రధాన కార్యదర్శులు, నలుగురు కార్యదర్శులు, ఆరుగుగు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఉంటారని చెప్పారు. అనుబంధ సంఘాలకు సంబంధించి యువజన, మహిళ, విద్యార్థి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విభాగాలను కూడా పూర్తి చేయాలన్నారు. సోషల్ మీడియాకు సంబంధించి డివిజన్‌కు ఒకరిద్దరిని ఎంపిక చేయాలని సూచించారు. వ్యక్తిగత స్వార్థం, రాజకీయాల కోసం కాకుండా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్ల చిత్తశుద్ధి ఉన్న వారిని కమిటీల్లోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. కమిటీలు వేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మోసాలు చేసే వాళ్లు కాకుండా పార్టీకి కమిట్‌మెంట్‌తో పనిచేసే వాళ్లను నియమించాలన్నారు. డివిజన్ పరిధిలో ఉన్న వైసీపీ నాయకులను సమన్వయం చేసుకుని వెళ్లాలని సూచించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కాకుండా అనంతపురం నియోజకవర్గ సమన్వయకర్తగా తాను ఎలా అయితే సమావేశం నిర్వహించి సూచనలు చేశానో.. అదే తరహాలో డివిజన్ స్థాయిలో సమావేశాలు పెట్టుకుని కమిటీల నియామకం పూర్తి చేయాలన్నారు. గ్రామ, డివిజన్ స్థాయిల్లో సైన్యంలా పని చేసే కమిటీలు ఉండాలని స్పష్టం చేశారు.

### ఫిబ్రవరి, మార్చిలో స్థానిక ఎన్నికలు

స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చిలో ఉంటాయని అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో పార్టీని బలోపేతం చేస్తూనే ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వైఎస్ఆర్‌సీపీ హయాంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారు. గత ఎన్నికల్లో ఓడిపోయినా ఎవరూ ఆత్మస్థైర్యం కోల్పోలేదని, మనకు అధికారమే పరమావధి కాదని తెలిపారు. ప్రజల సంక్షేమమే ముఖ్యం కాబట్టే కూటమి అధికారంలోకి వచ్చాక ప్రజల సమస్యలపై అనేక ఆందోళనలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం పోలీస్, రెవెన్యూ వ్యవస్థలను గుప్పెట్లో పెట్టుకుని అక్రమ కేసులు పెడుతున్నా ఎవరూ భయపడడం లేదని తెలిపారు. ఏడాదిన్నరగా చంద్రబాబు, అధికార పార్టీ నేతలు ప్రచారానికే పరిమితం అవుతున్నారని దుయ్యబట్టారు. వాస్తవాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

### డివిజన్ స్థాయిలో 'కోటి సంతకాల సేకరణ'

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా డివిజన్, పంచాయతీ స్థాయిలో 'కోటి సంతకాల సేకరణ' చేపట్టాలని అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. వైఎస్ జగన్ అధికారంలో ఉన్న సమయంలో విద్య, వైద్యానికి పెద్దపీట వేసిన విషయాన్ని గుర్తు చేశారు. కోవిడ్ వంటి పరిస్థితుల్లో ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలు అందించామని తెలిపారు. పేదలకు మెరుగైన వైద్యంతో పాటు వైద్య విద్యను అందుబాటులోకి తేవడం కోసం రూ.8 వేల కోట్లతో ప్రతి జిల్లాలో మెడికల్ కళాశాలల ఏర్పాటుకు వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారని తెలిపారు. రాష్ట్రంలో 2019 వరకు కేవలం 11 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు మాత్రమే ఉన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. వైఎస్ జగన్ పాలనలో 2023%-%2024 నాటికే ఐదు మెడికల్ కళాశాలల్లో తరగతులు ప్రారంభించామన్నారు. కానీ కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేస్తోందని మండిపడ్డారు. వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం ప్రారంభించినట్లు తెలిపారు. ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని చెప్పారు. డివిజన్, పంచాయతీల్లో ప్రతి ఇంటికి వెళ్లి సంతకాల సేకరణ చేపట్టాలన్నారు. సంతకాల సేకరణతో పాటు 'ప్రజా వైద్యం.. ప్రజల హక్కు' పేరుతో రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేయాలని సూచించారు. సంతకాల సేకరణ ప్రారంభం మాత్రమేనని, దీన్ని ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. ఇందులో భాగంగానే ఈనెల 28వ తేదీన 28వ తేదీన నియోజకవర్గ స్థాయిలో, నవంబర్ 12వ తేదీన జిల్లా స్థాయిలో ర్యాలీలు ఉంటాయని తెలిపారు

## మరీ ఇంత నిర్లక్ష్యమా?
## సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యంపై కలెక్టర్ ఆనంద్ ఫైర్



అనంతపురం, అక్టోబర్ (అనంత ప్రభ)

'ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఏడాదిలో 69 వేల మంది రోగులు వైద్యం పొందగా అందులో కేవలం 29 వేల మందిని ఎన్‌టీఆర్ వైద్య సేవల కింద నమోదు చేశారు. కనీసం ఆస్పత్రికి వచ్చిన వారిలో 50 శాతం మందిని కూడా నమోదు చేయకపోవడమేంటి? హెచ్‌డీఎస్‌లో రూ.1.7 కోట్లు ఉంటే రూ.10 కోట్లకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తారా..? ఎన్‌టీఆర్ వైద్య సేవ, అబా రిజిస్ట్రేషన్‌లోనూ ఎంతో వెనుకబడ్డారు. మరీ ఇంత నిర్లక్ష్యమైతే ఎలా' అంటూ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యంపై కలెక్టర్ ఆనంద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కలెక్టర్ అధ్యక్షతన హెచ్‌డీఎస్ (హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అందుబాటులో ఉన్న నిధులతో ఏవి అత్యవసరమో వాటినే అజెండాలో చేర్చాలి కానీ అందరూ ఇచ్చిన వాటిని నమోదు చేయడం సరికాదన్నారు. అబా రిజిస్ట్రేషన్ కేవలం 50 శాతమే నమోదైనట్లు లెక్కల్లో చూపుతున్నారని, ఏళ్లు గడుస్తున్నా అందులో పురోగతి ఉండదా అని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సౌజన్య కుమార్‌ను కలెక్టర్ ప్రశ్నించగా ఆయన నీళ్లు నమిలారు. ఏసీలు కొనుగోలు చేయడంతో పాటు నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రోగులకందే సేవల్లో నాణ్యత పెంచాలన్నారు. బయోవేస్టేజ్‌ను సరిగా తీసుకెళ్లకపోవడంతో ఇన్‌ఫెక్షన్స్ సోకే ప్రమాదం లేకపోలేదని హెచ్‌డీఎస్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆస్పత్రికి 50 వీల్‌చైర్లను అందిస్తామని హెచ్‌డీఎస్ సభ్యుడు రమణ తెలిపారు. సమావేశంలో హెచ్‌డీఎస్ కో చైర్మన్లు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, ఎన్‌టీఆర్ వైద్య సేవ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, సూపర్ స్పెషాలిటీ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బెన్‌డెక్ట్, హెచ్‌డీఎస్ సభ్యులు విశాల ఫెర్రర్ పాల్గొన్నారు.

తమకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదంటూ సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో విధులు నిర్వర్తించే పారిశుధ్య కార్మికులు స్పష్టం చేశారు. కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ముందు వారు అడ్డుకున్నారు. వైఎస్సార్ సీపీనా.. టీడీపీనా అంటూ నూతన ఏజెన్సీ నిర్వాహకులు తమకు ముచ్చెమటలు పట్టిస్తున్నారని వాపోయారు. అరగంట పాటు వారిని కదలనివ్వలేదు.

## బ్రిటీష్ కాలంలోనే ప్రభుత్వ చెరువుగా గుర్తింపు

- ఊరు మాదే చెరువు మాదే
- సర్వే నంబర్ 93లో ప్రభుత్వ చెరువుకు
- సోత్రీయదారులు మేమే.. పట్టాదారుల మేమే
- అవసరమైతే చెరువుగా వాడుతాం..లేదంటే లేఅవుట్ వేస్తాం
- ప్రభుత్వ చెరువు రిజిస్ట్రేషన్ అసలుదా నకిలీదా..?



కూడేరు, అక్టోబర్ (అనంత ప్రభ)

కూడేరు మండలం బ్రాహ్మణపల్లి సోత్రీయ గ్రామం సుమారు 2800 ఎకరాల విస్తీర్ణం ఓ కుటుంబం ఈ భూమికి యావత్తు వారసులం మేమేనని ప్రకటించుకోవడం రెవెన్యూ అధికారులు సైతం ఈ కుటుంబానికి వేలాది ఎకరాల కేటాయించడం విస్తుగొలిపే అంశం... గత 20 సంవత్సరాలుగా ఈ భూమిని శోత్రిదారులు విక్రయాలు జరుపుతున్నారు. వందలాది ఎకరాల్లో లేఔట్లు వెలిశాయి. అగ్రిగోల్డ్, స్కాంద వెంచర్లు ఈ సోత్రియ భూముల్లో వెలిసినవే..విస్తుగొలుపే అంశం ఏమిటంటే ఈ గ్రామంలోని వంక, వాగు, గుట్టా, నట్టా చివరికి చెరువును కూడా ఆక్రమించి లేఔట్లు వేస్తున్నారు. అదేఏమిటంటే ఈ గ్రామం అంతా మాదే... చెరువు కూడా మేము నిర్మించుకున్నదే.. మాకు ఇష్టం ఉంటే చెరువుగా వాడుకుంటాం వద్దంటే లేఔట్ వేస్తాం...అడగడానికి ఎవరికీ హక్కు లేదు అంటూ ఏకంగా ప్రభుత్వ చెరువు కట్ట మరువలను చెరిపివేసి కమర్షియల్ అవసరాలకు విక్రయిస్తున్నాట్లు సమాచారం. అదే క్రమంలోనే చెరువులోని లేఔట్ రోడ్లు వెలిశాయి. ఇది ఇలా ఉండగా బ్రాహ్మణపల్లిలో రాయల కాలం నాటి చెరువు ను బ్రిటిష్ వారు ప్రభుత్వ భూమి గా గుర్తించిన చెరువు ను నాటి రెవెన్యూ అధికారులు, భూ కబ్జాదారులు ఏకమై స్థానిక ప్రజానీకానికే పొంగనామాలు పెట్టి ప్రభుత్వ చెరువు ఆక్రమించుకున్నట్లు విశ్వసనీయ సమాచారం, అయితే ఈ ప్రభుత్వ చెరువు భూమిలో అక్రమ రిజిస్ట్రేషన్లు కూడా జరిగినట్లు బహిరంగంగా ఒకరికొకరు చర్చించుకుంటున్నట్లు తెలుస్తోంది. దాంతో రిజిస్ట్రేషన్లు అసులుదా లేక నకిలీదా.. అన్నా అనుమానాలు బలంగా వినపడుతున్నాయి. అయితే వందలాది ఎకరాలలో లేఔట్లు వేస్తున్నారు. ప్రభుత్వ చెరువు పట్టాగా మారినట్లయితే మరి ఫీల్డ్ మెజర్మెంట్ మ్యాపుల్లో ఎందుకు చెరువుగా నమోదు చేశారంటూ ప్రజాసంఘాల ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ ఆ ప్రభుత్వ చెరువును సబ్ డివిజన్ చేశారే అనుకున్న ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన చెరువును సబ్ డివిజన్ చేయడానికి వీల్లేదు. అయితే వారికి వారే ప్రభుత్వ చెరువు అని చెప్పకనే చెబుతున్నట్లు స్పష్టంగా అర్థం అవుతోంది. అంటే సోత్రీదారులు మాత్రం ఫీల్డ్ మెసర్మెంట్ మ్యాపుల్లో కావాలనే చెరువుగా మెజర్మెంట్ మ్యాప్లో డైగ్రామ్ గీయించుకున్నారా... లేక ఆక్రమణకు గురయిందా..? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. వందలాది ఎకరాలలో అక్రమ లేఅవుట్లు వెలుస్తుండడంతో తాజాగా ప్రజా సంఘం నాయకులు వందలాది మందిని పోగు చేసుకుని ప్రభుత్వ చెరువు భూముల్లో నిరుపేదల ఇల్లు స్థలాల కోసం ఎర్రజెండాల తో గత 11 రోజులగా ప్రజాసంఘాల ఉద్యమం చురుగ్గా సాగుతోంది. వాగలు వంకలు చెరువు భూముల్లో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదన్న సుప్రీంకోర్టు ఆదేశాల స్పష్టంగా ఉన్నప్పటికీ నాటి రెవెన్యూ అధికారులు తప్పిదాలతో ప్రభుత్వ చెరువు భూమి పట్టాగా మారడంతో ఇల్లు స్థలాలు లేని నిరుపేదలు కూడా ప్రభుత్వ చెరువు భూముల్లో ఇంటి స్థలాలు నిర్మించుకుంటామంటూ భీష్మించి కొట్టాలు వేసుకుంటున్నారు. చెరువు భూముల్లో లేఅవుట్లు, అనధికార నిర్మాణాలు చేపడుతున్నా అధికారులను మిన్నుకున్నారు కాబట్టే మేము గుడిసెలు వేసుకుంటాంమని ఇది ప్రభుత్వ స్థలం అని ఉద్యమకారులు గట్టిగా వాదిస్తూ ఉంటే సోత్రీయ దారులు మాత్రం ఇది పట్టా భూమిని సోత్రీదారులు చెబుతున్నారు. ఏది ఏమైనా ప్రభుత్వ చెరువు పట్టా భూమిగా మారినప్పుడు అదే ప్రభుత్వ చెరువు భూమి పేదలకు ఎందుకు ఇవ్వకూడదన్నదే మిలియన్ డాలర్ల ప్రశ్న

## దేశానికి మోదీ, రాష్ట్రానికి చంద్రబాబు ఒక వరం..ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం, అక్టోబర్ (అనంత ప్రభ)

అనంతపురం కూటమి ప్రభుత్వం లొ డబుల్ ఇంజన్ సర్కార్ తో రాష్ట్రంలో జెట్ స్పీడ్ తో అభివృద్ధి జరుగుతోందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. కర్నూలు జిల్లాలో జరిగిన సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఇప్పటికే నాలుగు రోజులుగా ప్రధాని సభ ఏర్పాట్లలో ఆయన పాల్గొన్నారు. ప్రధాని మోదీ రాయలసీమ ప్రాంతానికి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాయలసీమలోని పుణ్యక్షేత్రాల గురించే కాకుండా ప్రజల గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారన్నారు. భారత దేశానికి ప్రధాన మంత్రి మోదీ, ఏపీకి ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక వరం లాంటివారన్నారు. వారు ప్రతి నిత్యం అభివృద్ధి కోసం పరితపిస్తున్న నాయకులన్నారు. అలాంటి ఇద్దరు గొప్ప నాయకులతో కలిసి ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వంలో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు



మంత్రి నారా లోకేష్ కృషితో గూగూల్ ఏఐ డేటా సెంటర్ ను విశాఖకు తీసుకొస్తున్నారన్నారు. ఈ సంస్థ రాకతో ఏపీకి ప్రపంచ పటంలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో ప్రధాన మంత్రి సహకారంతో రాష్ట్రంలో మరిన్ని అద్భుతమైన ప్రాజెక్టులు వస్తాయని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆశాభావం వ్యక్తం చేశారు

## కర్నూలులో సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ బహిరంగ సభ



అనంతపురం, అక్టోబర్ (అనంత ప్రభ)

అనంతపురం గూగుల్ ఏఐ డేటా సెంటర్ దేశంలోనే ఒక ఐకాన్.

భారతదేశ%శీ% ప్రధాని మోదీ గారు రాయలసీమ ప్రాంతానికి రావడం చాలా సంతోషం..

అనంతపురం రాయలసీమలోని పుణ్యక్షేత్రాల గురించి మాట్లాడుతూ... శక్తిపీఠం, జ్యోతిర్లింగం వెలసిన క్షేత్రాన్ని దర్శించడం చాలా సంతోషంగా ఉంది అని అన్నారు, ప్రజల గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు.

భారత దేశానికి ప్రధాన మంత్రి మోదీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఒక వరం. వారు ప్రతి నిత్యం అభివృద్ధి కోసం పరితపిస్తున్నారు. అలాంటి ఇద్దరు గొప్ప నాయకులతో కలిసి ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వంలో భాగస్వామ్యం కావడం మన అదృష్టం.

లిఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్యులు గౌరవనీయులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు, ఐ.టి. శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ గారి కృషితో గూగూల్ ఏఐ డేటా సెంటర్ ను విశాఖకు తీసుకొస్తున్నారన్నారుఈ సంస్థ రాకతో ఏపీకి ప్రపంచ పటంలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుంది. రానున్న రోజుల్లో ప్రధాన మంత్రి సహకారంతో రాష్ట్రంలో మరిన్ని అద్భుతమైన ప్రాజెక్టులు వస్తాయి అందులో ఎటువంటి సందేహం లేదు

ఈ కార్యక్రమంలో పాల్గొన్న.తుల్జాపూర్ స్వప్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వీరశైవ లింగాయత్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్ పర్సన్, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిస్వప్న పత్రిక ముకంగా తెలిపారు.

## " ది టెంపుల్ సిటీ ఆఫ్ రాయలసీమ " ప్రయత్నానికి తొలి అడుగు.
## - వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ చరిత్ర పుటల్లోకి ఎక్కిన తాడిపత్రి శ్రీ శివసాయి మందిరం



తాడిపత్రి, అక్టోబర్ (అనంత ప్రభ)

తాడపత్రి జిల్లాలోని తాడిపత్రి పట్టణం సంజీవ్ నగర్ ఐదవ వ రోడ్డులో వెలిసిన శ్రీ శివసాయి మందిరంలో సాయిబాబా విగ్రహం వరల్డ్ బుక్ అఫ్ రికార్డ్స్ స్థానం దక్కించుకుంది. రాజస్థాన్ లోని జైపూర్ నుంచి ప్రత్యేకంగా ఏక శిలతో 9.5 అడుగులు ఎత్తు, ఏడు టన్నులు బరువు కలిగి ఉండటం ఈ సాయి బాబా విగ్రహం యొక్క ప్రత్యేకత. అహ్మదాబాద్ కు చెందిన వరల్డ్ బుక్ అఫ్ రికార్డ్స్ చెందిన అధికారి పవన్ సోలంకి తాడిపత్రి కి చేరుకుని విగ్రహం ఎలా ఉంది ఏకశిలనా.. విగ్రహం యొక్క ప్రత్యేకత ఏంటో క్షుణ్ణంగా తెలుసుకుని వెళ్లారు. అనంతరం రికార్డులు పరిశీలించి భారతదేశంలో నే ఎక్కడ కూడా ఇలాంటి ఏకశిలా విగ్రహం ఇంత పరిమాణంలో లేదని ధ్రువీకించారు. అనంతరం గురువారం తాడిపత్రికి చేరుకుని వరల్డ్ బుక్ అఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్, మెడల్స్ ను తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసి ప్రభాకర్ రెడ్డి, స్వ రవీంద్రరెడ్డిలు అందుకున్నారు. తాడిపత్రికి ఆధ్యాత్మికలో అవార్డులు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తాడిపత్రిని ది టెంపుల్ సిటీ అఫ్ రాయలసీమ చేసే ప్రయత్నంలోనే ఇలాంటి అవార్డులు రావడం ఎంతో శుభ పరిమాణం అన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో తాడిపత్రి ప్రజలు, మహిళలు సైతం పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున సాయిబాబా భక్తులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీటీసీ కుమార్తె వివాహానికి హాజరైన రాష్ట్ర యువనేత ప్రణయ్ రెడ్డి



కూడేరు, అక్టోబర్ 16 (అనంత ప్రభ)
కూడేరు మండల పరిధిలోని కరుట్లపల్లి గ్రామంలో గురువారం రోజున మాజీ ఎంపీటీసీ రామాంజనేయులు కుమార్తె వివాహం వైభవంగా ఈ వివాహ వేడుకకు ఉరవకొండ నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే వై విశ్వేశ్వర్ రెడ్డి తనయుడు రాష్ట్ర యువ నేత ప్రణయ్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఓబులమ్మ,మండల ఎంపీపీ నారాయణరెడ్డి, మండల వైస్ ఎంపీపీ దేవాంజనేయులు, మండల యువజన విభాగం అధ్యక్షుడు ఇప్పేరు కేశన్న , ఆత్మకూరు మండల వైస్ ఎంపీపీ భర్త అధిక రెడ్డి, మెకానిక్ శంకర్ రెడ్డి, తదితరులు హాజరయ్యారు

## గార్లదిన్నె మండల కేంద్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల కార్యక్రమం

## గార్లదిన్నె మండల వైఎస్ఆర్సిపి పరిశీలకులు హోదాలో పాల్గొన్న తరిమెల వంశీ గోకుల్ రెడ్డి

అనంతపురం, అక్టోబర్ (అనంత ప్రభ)
శింగనమల నియోజవర్గం గార్లదిన్నె మండల కేంద్రంలోని.. పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజవర్గం సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజనాథ్ నిర్ణయం మేరకు గార్లదిన్నె మండల కేంద్రంలోని మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమంలో
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజనాథ్ పాల్గొన్నారు, అనంతరం నాయకులు, పార్టీ శ్రేణులు సమావేశం నిర్వహించారు
రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం యొక్క ముఖ్యాంశాలు: లక్ష్యం: రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలను పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం పద్ధతిలో ప్రైవేటీకరించడానికి ఎన్డీఏ ప్రభుత్వం (ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని) తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకించడం. కార్యక్రమ ఉద్దేశం: ఈ ప్రైవేటీకరణ పేద విద్యార్థులు, ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతుందని, పేదలకు ఉచిత వైద్య విద్య, వైద్య సేవలు అందకుండా పోతాయని వైఎస్ఆర్సిపి ఆరోపిస్తోంది.
పార్టీ కార్యాచరణ: వైఎస్ఆర్సిపి రాష్ట్రవ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టింది.
ఈ కార్యక్రమం అక్టోబర్ 10 నుండి నవంబర్ 22 వరకు 'రచ్చబండ' (గ్రామ స్థాయి అవుట్‌రీచ్) కార్యక్రమాల ద్వారా మరియు కరపత్రాల పంపిణీ ద్వారా నిర్వహించబడుతోంది. ర్యాలీలు, వినతులు: ప్రణాళిక ప్రకారం, అక్టోబర్ 28న నియోజకవర్గ స్థాయిలో భారీ ర్యాలీలు, నవంబర్ 12న జిల్లా స్థాయి ర్యాలీలు, కలెక్టర్లకు మెమోరాండం సమర్పణ ఉంటుంది. నవంబర్ 25న వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో కోటి సంతకాలను గవర్నర్‌కు సమర్పించాలని నిర్ణయించారు. తరిమెల వంశీ గోకుల్ రెడ్డి పాత్ర: గార్లదిన్నె మండల పరిశీలకులుగా, ఆయన మండల స్థాయిలో ఈ కోటి సంతకాల సేకరణ మరియు నిరసన కార్యక్రమాలలో పార్టీ శ్రేణులను, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ క్రియాశీలకంగా పాల్గొన్నారు.



ఈ నిరసన ద్వారా గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన 17 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరించకుండా ఆపాలని పార్టీ డిమాండ్ చేస్తోంది. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి జిల్లా రైతు విభాగం అధ్యక్షులు నారాయణరెడ్డి, మండల కన్వీనర్ ఎల్లారెడ్డి, శింగనమల మండలం పరిశీలకులు బండ్లపల్లి ప్రతాప్ రెడ్డి, జడ్పిటిసి సభ్యులు, నీలం భాస్కర్, జడ్పిటిసిలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రాజిత్ కాలనీ యందు ఐ సి డి ఎస్.వారు అంగన్వాడీ నందు సీమంతాలు



అనంతపురం, అక్టోబర్ (అనంత ప్రభ)
అనంతపురం రూరల్ ప్రాజెక్టు పరిధిలోని ఇంద్రజిత్ కాలనీ అంగన్వాడి కేంద్రంలో సిడిపిఓ ఉమా శంకరమ్మ గారి అధ్యక్షతన సూపర్వైజర్ భారతి ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలు కార్యక్రమం నిర్వహించడం జరిగింది పోషణ మాసోత్సవాల లో భాగంగా ఈరోజు జంక్ ఫుడ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలు , చక్కెర ,ఉప్పు, నూనె ఎక్కువ తీసుకోవడం వల్ల కలిగే అనర్థాల గురించి సిడిపిఓ ఉమా శంకరమ్మ గారు వివరించడం జరిగింది, మరియు గర్భవతులకు సామూహిక సీమంతాలు నిర్వహించడం జరిగింది, కుటుంబానికి పోషణ, తల్లి - శిశు సంరక్షణలో పురుషులు కూడా భాగస్వామ్యం కావాలని తెలియజేయడం జరిగింది నిర్వహించే పోషణ వేడుక కార్యక్రమాలలో పురుషులు కూడా పాల్గొనేలా అవగాహన కల్పించడం జరిగింది... ఈ కార్యక్రమంలోఎంపీటీసీ నాగరత్నమ్మ గారు అంగన్వాడీ టీచర్లు హసీనా, సరళ,అపర్ణ, రామలక్ష్మి, వరలక్ష్మి , నాగలక్ష్మి మరియు లబ్ధిదారులు తండ్రులు పాల్గొన్నారు.







## ఆశ్చర్యపరుస్తున్న హైదరాబాదీ ఇడ్లీ



స్విగ్గీ ఆర్డర్లలో ఇడ్లీయే రాజానండి బాబూ.. అల్పాహారాల్లో ఇడ్లీకి ఉన్న క్రేజ్ అలాంటిదండి మరి..!

ఎందుకటే గత ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా 3.3 కోట్ల ప్లేట్లను ఆ సంస్థ పంపిణీ చేసింది. అల్పాహార ప్రియుల్లో ఆ ఇడ్లీకి ఉన్న క్రేజ్ ఎంతో తన నివేదికలో వివరించింది. అంతేకాదు.. ఈ సిగ్గీ ద్వారానే హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి అరుదైన రికార్డు సొంత చేసుకున్నాడు. ఆ విశేషాలంటో చదివేద్దామా?

ఇడ్లీ.. ఇడ్లీ.. ఇడ్లీ.. అవును! ఇడ్లీకి ఉన్న క్రేజే వేరు. పూర్వకాలం నుంచి అల్పాహారంగా దీనినే తీసుకుంటున్నారు. ఇడ్లీ లేని హొటలూ ఉండదు. బెంగళూరు వాసులు రవ్వ ఇడ్లీలు, చెన్నై వాసులు నెయ్యి, పొడి ఇడ్లీలు ఇష్టపడితే.. హైదరాబాద్ వాసులు కారం పొడి, నెయ్యి, చట్నీలతో కూడిన ఇడ్లీలు ఇష్టపడతారు. అందుకే ఈ ఇడ్లీలకు ఎక్కడైనా డిమాండ్ ఉంటుంది. వీటి ద్వారా హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఓ అరుదైన రికార్డును సొంతం చేసుకున్నాడు.

ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ ద్వారా గత ఏడాది కాలంగా రూ.ఆరు లక్షలను కేవలం ఇడ్లీల కోసమే ఖర్చు చేశాడంట. ఇడ్లీలంటే తనకు ఎంత ఇష్టమో ఈ రికార్డు ద్వారా నిరూపించాడు. తన కోసమే కాదు.. తన కుటుంబసభ్యులు, స్నేహితుల కోసం ఏడాది మొత్తంలో 8428 ప్లేట్ల ఇడ్లీలను ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేశాడు. ఒక్క హైదరాబాద్‌లోనే కాదు.. తాను ఎక్కడికి వెళితే అక్కడ స్విగ్గీలో ఆర్డర్ ఇచ్చేయడం ఈయనకు అలవాటు.

ప్రపంచ ఇడ్లీ దినోత్సవం నాడు ఇడ్లీ ఆర్డర్లపై నిర్వహించిన అధ్యయన నివేదికను స్విగ్గీ సంస్థ విడుదల చేసింది. మరోవైపు ఈ సంస్థ గత ఏడాదికాలంలో దేశవ్యాప్తంగా 3.3 కోట్ల ప్లేట్ల ఇడ్లీలను పంపిణీ చేసినట్టు తెలిపింది. ఆ నివేదిక ప్రకారం ఎక్కువ ఇడ్లీలను ఆర్డర్ చేసిన నగరాల్లో బెంగళూరు, హైదరాబాద్, చెన్నై మొదటి మూడు స్థానాల్లో నిలిచినట్టు తెలిపింది.

కోల్‌కతా, కొచ్చి, ముంబై, కోయంబత్తూరు, పుణే, వైజాగ్, ఢిల్లీ నగరాలు నాలుగు, ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది, పది స్థానాల్లో ఉన్నాయి. చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, కోయంబత్తూరు, ముంబై వాసులు డిన్నర్‌గా కూడా ఇడ్లీని ఎక్కువ ఇష్టపడుతున్నట్టు స్విగ్గీ తన సర్వేలో వెల్లడించింది.

చాలా మంది రాత్రి పూట టిఫిన్‌చేసే వాళ్లు కూడా ఇడ్లీపైనే మక్కువ చూపిస్తున్నట్టు ఫుడ్ డెలవరీ సంస్థ స్విగ్గీ పేర్కొంది. అయితే అల్పాహార ఆర్డర్స్‌లో మసాలా దోశ మాత్రం ఫస్ట్ ప్లేస్‌లో ఉంటే, ఇడ్లీ దానిని అనుసరిస్తోంది.

## మామిడిపండుతో టేస్టీ అండ్ సింపుల్ రెసిపీలు

సీజనల్ ఫ్రూట్ మామిడిపండు. వేసవిలో మాత్రమే దొరికే ఈ పండును కచ్చితంగా తినమని చెబుతారు పోషకాహార నిపుణులు. విటమిన్ సి, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, ఫైటో న్యుట్రియెంట్లు అధికంగా ఉంటాయి. ఇది తినడం వల్ల మన శరీరం ఇనుమును సులువుగా శోషించుకుంటుంది. జీర్ణ క్రియను మెరుగుపరుస్తుంది. రోగనిరోధక వ్యవస్థకు మామిడిపండు ఎంతో అవసరం. అలాగే బరువు తగ్గించే డైట్ లో కూడా ఇది ఒక భాగం. వీటిని తింటూ బరువును సులువుగా తగ్గొచ్చు. వైద్యులు కూడా ఆరోగ్యకరమైన ఆహారాన్ని తింటూ బరువు తగ్గమని సూచిస్తారు. మామిడి పండుతో సింపుల్‌గా చేసుకునే రెసిపీలు ఇవిగో. వీటిని పెద్దగా వండాల్సిన అవసరం లేదు.

మామిడిపండు ఓట్స్ స్మూతీ
ఓట్స్ - రెండు స్పూన్లు
మామిడిపండు - ఒకటి
చియా సీడ్స్ - ఒక స్పూన్
నీళ్లు - ఒక గ్లాసు

తయారీ ఇలా
1. స్టవ్ మీద కళాయిని పెట్టి అందులో ఒక గ్లాసు నీరు వేయాలి.
2. ఆ నీళ్లలో ఓట్స్, చియా సీడ్స్ వేసి ఉడికించాలి అవి మెత్తగా అయ్యాక చల్లారనివ్వాలి.
3. ఈ మొత్తం మిశ్రమాన్ని బ్లెండర్లో వేసి జ్యూస్ లా చేసుకోవాలి. 4. ఆ మిశ్రమాన్ని ఒక గ్లాసులో వేసి పైన మామిడి పండు ముక్కలను వేసుకోవాలి. మామిడి పండు ఓట్స్ స్మూతీ రెడీ అయినట్టే.

కొబ్బరితో మామిడిపండు ఓట్ మిల్
లేత కొబ్బరి - 50 గ్రాములు
కొబ్బరి పాలు - అర గ్లాసు
ఓట్స్ - అర కప్పు
మామిడిపండు ముక్కలు - అరకప్పు
డ్రై ఫ్రూట్స్ తరుగు - గుప్పెడు
తేనె - ఒక స్పూను
యాలకుల పొడి - చిటికెడు

1. ఒక గిన్నెలో పైన చెప్పిన అన్ని పదార్థాలను వేసి బాగా కలిపి రాత్రంతా ఉంచాలి.
2. గిన్నెపై మూత పెట్టడం మర్చిపోవద్దుచ లేదా ఫ్రిడ్జ్ లో పెట్టినా మంచిదే.
3. ఉదయం లేచాక వాటిని అల్పాహారంగా తింటే ఆరోగ్యానికి మంచిది. రుచి కూడా అదిరిపోతుంది.

మామిడి సలాడ్
వర్జిన్ ఆలివ్ ఆయిల్ - ఒక స్పూను
పాలకూర - గుప్పెడు
మామిడిపండు - ఒకటి
తేనె - ఒక స్పూను
మిరియాల పొడి- చిటికెడు

1. పాలకూర ఆకులను బాగా కడిగి సన్నగా తురుముకోవాలి.
2. మామిడిపండును కూడా సన్నగా తరగాలి.
3. సలాడ్ చేయడానికి ఒక గిన్నెను తీసుకొని అందులో ఆలివ్ ఆయిల్ వేసి గిన్నె కింద అడుగుభాగానికి బాగా పట్టించాలి.



4. ఆ గిన్నెలో పాలకూర తరుగును, మామిడిపండు తరుగును వేయాలి.
5. వాటిని బాగా కలపాలి. తేనే, పెప్పర్ కూడా చల్లి బాగా కలుపుకోవాలి.
6. ఆలివ్ ఆయిల్‌ను పైన చల్లుకొని సలాడ్ తినాలి.
ఈ మామిడి సలాడ్ కంటికి, చర్మానికి, మెదడుకు, కాలేయ పనితీరుకు మేలు చేస్తుంది.

## దగ్గుతో బాధపడుతుంటే కేవలం 10 నిమిషాల్లో ఇలా సిరప్‌ను ఇంట్లోనే తయారు చేసుకోండి

వాతావరణంతో పాటు వచ్చే రోగాల్లో ముఖ్యమైనవి జలుబు, దగ్గు, జ్వరం, అలెర్జీలు. వీటిలో అతి సాధారణంగా జలుబు, దగ్గు ఎక్కువ మందిని ప్రభావితం చేస్తాయి. మార్కెట్లో దొరికిన దగ్గు సిరప్‌లనే ఎక్కువ మంది వినియోగిస్తారు. అయితే పూర్వం ఈ దగ్గు సిరప్‌లు ఏవి ఉండేవి కాదు. వారు ఇంట్లోనే దగ్గుకు ఔషధాన్ని తయారు చేసుకొని తాగేవారు. కేవలం కొన్ని నిమిషాల్లోనే ఇది తయారైపోతుంది. ఎలాంటి సైడ్ ఎఫెక్టులూ ఉండవు. కాబట్టి సహజ పద్ధతిలో మీరు కూడా ఇంట్లోనే ఇలా దగ్గు సిరప్ తయారు చేసుకొని తాగితే మంచిది.

ఇంట్లోనే దగ్గు ఔషధం తయారీకి ఐదు పదార్థాలు కావాలి. తేనే, మిరియాలు, తులసి, అల్లం, నిమ్మకాయ వంటి వాటితో ఈ ఔషధాన్ని తయారు చేస్తారు. వీటన్నింటిలో కూడా విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో నొప్పిని, మంటను నయం చేస్తాయి. శ్వాసకోశ సమస్యలను దూరం చేస్తాయి. చల్లని వాతావరణంలో వచ్చే వ్యాధులతో పోరాడుతాయి. వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయి.



తయారీ ఇలా..
ఈ దగ్గు సిరప్ తయారు చేయడానికి ముందుగా కళాయిని స్టవ్ మీద పెట్టండి. ఆ కళాయిలో ఒక కప్పు నీరు, రెండు టేబుల్ స్పూన్ల అల్లం తరుగు, తరిగిన నిమ్మకాయ ముక్కలను వేయండి. మిశ్రమం సగానికి తగ్గేవరకు చిన్న మంట మీద మరిగించండి. తరువాత అర స్పూను మిరియాల పొడిని జోడించండి. అందులోనే నాలుగు తులసి ఆకులు వేసి మరిగించండి. తర్వాత స్టవ్ కట్టేయండి. గోర-ువెచ్చగా మారాక ఒక స్పూను తేనెను అందులో కలపండి. ఆ మిశ్రమాన్ని ఒక సీసాలో వేసి భద్రపరుచుకోండి. మూడు పూటలా భోజనం చేశాక ఒక టేబుల్ స్పూన్ ఔషధాన్ని తాగండి. ఇలా వారం రోజులపాటు ఈ ఔషధాన్ని సేవిస్తే దగ్గు సహజసిద్ధంగానే తగ్గిపోతుంది. సాధారణంగా వచ్చే దగ్గు అయితే ఈ ఔషధాలకు నయం అవుతుంది. ఈ ఔషధానికి దగ్గు నయం కాకుండా ఉంటే అది తీవ్రమైనదిగా పరిగణించవచ్.చు అప్పుడు వైద్యులను కలిసి అల్లోపతి మందులను వాడండి.

దగ్గు మందుల వల్ల తీవ్రమైన సైడ్ ఎఫెక్టులు వస్తున్నట్టు ఇప్పటికే ఎన్నో వార్తలు వచ్చాయి. కొన్ని దేశాల్లో కొన్ని రకాల దగ్గు మందులను నిషేధించారు. దానికి కారణం అందులో వాడుతున్న కొన్ని రసాయన సమ్మేళనాలే. ఇలా ఇంట్లోనే సహజసిద్ధంగా దగ్గు ఔషధాన్ని తయారు చేసుకుంటే, ఎలాంటి సైడ్ ఎఫెక్టులు ఉండవు. చెడు ప్రభావాలు పడవు. ఈ మందు మీకు సరిగా పనిచేయకపోయినా, దీనివల్ల కలిగే నష్టం మాత్రం ఉండదు. కాబట్టి ఒకసారి దగ్గుకు ఈ ఔషధాన్ని తయారు చేసుకొని వాడి చూడండి. మీకు దీని వల్ల దగ్గు తగ్గితే భవిష్యత్తులో అల్లోపతి మందులు వాడాల్సిన అవసరం ఉండదు.